
కథ

# నిచ్చెన



"దండాలు మాష్టారూ...!"

చదువుతున్న పేపరు ప్రక్కన పెట్టి తలెత్తి చూశాను.

మా ఊరి మంగలి కామయ్య తన పదేళ్ళ కొడుకుతో నిల్చుని ఉన్నాడు.

"ఏం, కామయ్యా... కులాసాయేనా... ఏం పని మీద వచ్చావ్...?? రా... కూర్చో...!"

అరుగుమెట్టుపై ఒదిగి ఒదిగి కూర్చున్నాడు కామయ్య. అతడి ప్రక్కన కుర్రాడు కూడా కూర్చున్నాడు.

"ఇప్పటికి క్షేమమే బాబూ... మీ దగ్గర పనిపడి ఈ నా ఎర్రిగాడిని పట్టుకొచ్చా..." చెప్పాడు కామయ్య.

"మీ వాడికి నాతో పనేటీ!?" ఆశ్చర్యంగా అడిగాను. "మీతోనే పని బాబూ... మనూరిబడిలో ఈడు ఐదవ తరగతి పూర్తిచేశాడు. ఈణ్ణి ఈపట్నంలో అయిస్కూలులో చేర్పిద్దామని తమ దగ్గరికి తెచ్చాను " చెప్పాడు కామయ్య.

"అయితే మీ వాడిని మా స్కూల్లో చేర్పించాలంటావ్... అలాగే మా స్కూలు హెడ్మాష్టరుతోకలిసి చేర్పించేద్దాం..."

"అట్టాగే బాబూ..."

"మనూరి సంగతులు ఏమిటి కామయ్యా...?" పుట్టి, పెరిగిన ఊరి గురించి అడిగాను.

"చెప్పేందుకు విశేషమేముంది బాబూ... ఈ యేడు పంటలు సరిగా పండలేదు. పుట్టిపెరిగిన నేల అయినా బతకటం కష్టంగా ఉంది. అందుకే ఉన్న ఈ ఒక్కణ్ణి తీసుకొని బ్రతుకుదామని ఈ పట్నం వచ్చేశాను. మీరు దయతలిస్తే మీ ఇసుకూలు మాష్టర్లతో చెప్పినాలుగు ఇల్లు చూపిస్తే కులం పని చేసుకొని బతకాలనుంది."

నాకు తెలుసు కామయ్య మంచి క్షుర కర్మ కారుడని. కామయ్య కొన్నాళ్ళు ఒరిస్సాలో కత్తెరపని నేర్చాడు. డిప్ప కటింగ్ నుండి డిస్కోకటింగ్ వరకూ బాగా కత్తెర వేయగలడు. కత్తెరపనిచేస్తున్నంతసేపూ కామయ్య మాటల నేర్పుతో ఎదుటివారి మనసు దోచుకోవడంలో నేర్పరి. మాతాతల కాలం నుండి సంవత్సర జీతంపై కామయ్య కత్తెర పని చేస్తున్నాడు. అందుకే కామయ్య చెప్పగానే వాడికి ఈ ఊళ్ళో బతికేందుకు కావలసిన ఏర్పాటుచేయాలనే నిర్ణయించుకున్నాను.

"ఇప్పుడు ఎక్కడ ఉంటున్నావ్ కామయ్యా...?"

"ఈ ఊళ్ళోనే గోపాల్రావు వీధిలో చిన్న పూరిల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నాను బాబూ... మరినేను సెలవు తీసుకుంటా." అంటూ లేచాడు కామయ్య.

"ఈ పూటకు మా ఇంట్లో భోంచేసి వెళ్ళు కామయ్యా..."

"ఇంకోసారి ఎప్పుడైనా భోంచేస్తాలే బాబూ.." తన ఆత్మాభిమానం చంపుకొని వెళ్ళిపోయాడు కామయ్య.

★ ★ ★

"నీ కొడుకును స్కూల్లో చేర్పించేశాను కామయ్యా..."

"చిత్తం..."


"కానీ..."

"కానీ, అంటున్నారు. ఏమిటి బాబూ...?" అడిగాడు కామయ్య.

"వాడికి తరగతికి తగిన చదువులేదు కామయ్యా...?"

"వాడి చదువు గురించా బాబూ...మనూరి మాష్టర్లు ఏం చదువు చెపుతారు బాబు... మా ఎర్రిగాడి స్వయం కృషివల్లే ఆ మాత్రం సదువైనా ఆడిలో ఉంది."

కామయ్య అతిశయానికి నాకు కోపం వచ్చింది.




కొండ ఎల్లాస శ్రీనివాసరావు

"మీవాడు ఇంకా శ్రద్ధగా చదివితేకానీ తగిన స్టాండర్డ్ రాదు కామయ్యా... మా స్కూలు మాష్టర్లతో చెప్పి వాడికి చదువుపట్ల శ్రద్ధ కలిగేటట్లు చేద్దాంలే..."

"మా వాడు కష్టపడే సదువు తాడు బాబూ... ఆడి కృషినూత్తాఉంటే ఆడో పెద్ద ఆఫీసరయిపోతాడనిపిస్తంది..."

అసలే అత్తెసరు చదువలో ఉన్న ఎర్రిగాడు పేద్ద ఆఫీసరు అవుతాడనే కామయ్య మాటలకు నాకు ఎందుకో నవ్వొచ్చింది.


"ఇది హైస్కూలు చదువు... శ్రద్ధగా చదవాలి..." అన్నాను.

"అదంతా మీరే చూసుకోవాల బాబయ్యా... ఆణ్ణి సదువులో ఓదారికి తెస్తే అదే పదివేలు... మరి నా నెల్లివస్తాను..." కామయ్య అక్కడినుండి వెళ్ళిపోయాడు.

★ ★ ★

"ఒరే ఎర్రిగా...! నీకు కష్టంగా ఉన్నసదువు ఏదిరా? ఆ మాష్టారి కాడికెళ్ళి కలుస్తాను..."

ఏన్యువల్ పరీక్షలు వ్రాసిన ఎర్రిగాణ్ణి అడిగాడు కామయ్య.



"ఒక్క లెక్కలు తప్ప మిగతా పరీక్షల... బాగానే రాసానయ్యా..."

"అసలు పెద్దోల్లే సరిగా లెక్క... ...లేని ఈ రోజుల్లో నీవెలా చేయగలవు లెక్కలు...? సరే. నాను ఆ లెక్కల మాష్టారితో కలిసి మాట్టాడు తానులే..." భరోసాగా అన్నాడు కామయ్య.

★ ★ ★

మొత్తానికి లెక్కల మాస్టారితో మాట్లాడి లెక్కలబ్బేలా చూస్తూ..సంవత్సరానికి సంవత్సరం ఎర్రిగాణ్ణి టెన్తుక్లాసు వరకూ లాక్కొచ్చాడు కామయ్య.

ఆ ఊరి కాలేజి ప్రిన్సుపాల్‌ని కలిసి, కాలేజీలో ఎటెండర్‌గా ఎర్రిగాణ్ణి వేయించాడు.

అలా జీవితంలో అడుగు పెట్టిన ఎర్రిగాడు కాలేజీ స్టూడెంట్లతో, సిబ్బందితో తలలో నాలుకలా మెదిలి, ప్రైవేటుగా బిఎ వరకూ కట్టిపాసై ఎటెండర్ నుండి ఆఫీస్ అసిస్టెంట్‌గా ఎదిగాడు ఎర్రారావు ఉరఫ్ ఎర్రిగాడు.

చదువ్‌సరిగ్గా అబ్బదు అనుకొన్న ఎర్రిగాడు వాడి తండ్రి కామయ్య అనుకున్నట్టు ఆఫీసర్ కాకపోయినా ఆఫీసు అసిస్టెంటు అయినందుకు నాకెంతో ఆశ్చర్యంతోపాటు ఆనందం కలిగేది.

ఈలోగానే కొడుకు ఉన్నతిని చూసి ఆనందించాల్సిన కామయ్య మరణించాడు.

కొన్ని సంవత్సరాలు జరిగిపోయాయి. ఇప్పుడు ఎర్రిగాడు ఏ డిపార్టుమెంటులో ఎక్కడ ఉద్యోగం చేస్తున్నాడో తెలీదుకానీ, నేను మాత్రం ఉన్న ఊళ్ళోనే అదే స్కూలు అసిస్టెంటుగా ఉన్నాను. ఎర్రిగాడి గురించి పూర్తిగా మరచిపోయాననే అనుకోవాలి

అప్పుడే జరిగింది ఈ సంఘటన. అనుకోకుండా స్కూలు అసిస్టెంటునుండి మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌గా నాకు ప్రమోషన్ ఇస్తూ దూరంగా బదిలీ కావించబడ్డాను.

రిటైర్‌మెంటుకి ముందు పై ఊరు వెళ్ళలేక ప్రమోషన్ వదులుకోలేక... సతమత మవుతున్న నాకు నా కొలీగ్స్ ప్రోద్బలంతో ప్రమోషన్ ఇచ్చిన ఊరికి వెళ్ళడానికి నిశ్చయించుకున్నాను. మంచి రోజు చూసి ట్రాన్స్ఫర్ అయిన కొత్త ఊరికి బయలుదేరి వెళ్ళాను.

కొత్త ఊరి చివరనున్న మండలాఫీసు చేరుకొని ప్యూను సహాయంతో యం.డి.ఓ రూమ్ లోని... ...ఎపెట్టాను.

"నమస్తే సార్...!"

యం.డి.ఓ.కి విష్ చేశాను. చదువుతున్న పేపరు పక్కనపెట్టి నాకేసి చూసిన యం.డి.ఓ.ను చూసి నిశ్చేష్టుడనయ్యాను. కారణం... ఎం.డి.ఓ. ఎవరో కాదు గతంలో ఎర్రిగాడు అనే మంగలి కామయ్య కొడుకు ఎర్రిగాడు.

ఎర్రిగాడు ఈ విధంగా ఈ విధంగా నాకు బాస్‌గా ఎదురౌతాడని నేనెన్నడూ ఊహించలేదు. చాలాసేపు ఆ షాక్ నుండి తేరుకోలేక పోయాను.

"యస్... మిస్టర్ రామారావ్... ఐ థింక్ యూవార్ సర్‌ప్రైజ్డ్ టు సీ మి..." దర్పంగా అన్నాడు యం. డి.ఓ. ఎర్రారావు.

"మంగలి కామయ్య కొడుకు ఎర్రిగాడివి కదూ...?" అడుగుదామని పెదవుల దాకా వచ్చినమాట ను... అతడు నా కాబోయే బాస్ అనే సెన్స్ రాగానే నోట్లోనే మింగి ముఖంపై నవ్వు పులుముకున్నాను!

"నేను తమ దగ్గర యం.ఇ.ఓ.గా జాయిన్ అవుదామని వచ్చాను సార్." చెప్పాను.

"సంతోషం... జాయినింగ్ రిపోర్టు ఇచ్చి సెక్షన్‌లోకి వెళ్ళండి."

ఎర్రారావులో ఆఫీసరు సుపీరి యారిటీ కొట్టొచ్చినట్లు కనిపించింది.

"అలాగే సార్..." సైడుసీటు దగ్గరున్న టేబిల్‌పై జాయినింగ్ రిపోర్టు నిల్చొనే వ్రాసి ఇచ్చాను.

కాలింగ్ బజ్జర్‌నొక్కి అటెండర్‌ను పిలిచి "రామోజీ... ఇతడు మన ఆఫీస్‌లో కొత్తగా వచ్చిన యం.ఇ.ఓ., సీటు చూపించు..." అంటూ నన్ను అటెండర్ రామోజీకి పరిచయం చేశాడు, యం.డి.ఓ. ఎర్రారావు.

సెక్షన్‌లో రామోజీ చూపించిన సీట్లో కూర్చున్నాను.

కానీ నా తలనిండా ఎర్రారావు గతం గురించిన జ్ఞాపకాలే ముసురుకున్నాయి.

నా సహాయంతో బడిలో చేరిన ఎర్రిగాడనే ఎర్రారావు.. జీవితంలో నిచ్చెన మెట్లు ఎక్కినట్లు పైపైకి ఎదిగి ఇప్పుడు... నాకు 'బాస్' అయిపోయాడు!

"మా ఎర్రిగాడు ఎప్పటికైనా ఒక ఆఫీసరు అవుతాడు" కామయ్య ఏ లోకాల్లో ఉన్నాడోకానీ అతని మాటలు నిజమైనందుకు నాకు ఆశ్చర్యంతో పాటు ఆనందం కలిగింది.

★